క్లుప్తంగా

ఇసుక పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి



ఈర్లదిన్నె ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయశ్రీ

సి.బెళగల్: మండలంలో ఇసుక పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి తహసీల్దార్ విజయశ్రీ వీఆర్వోలను ఆదేశించారు. గురువారం ఆమె మండలంలోని తుంగభద్ర నదితీర గ్రామాలైన ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోటలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని వీఆర్వోలకు తహసీల్దార్ సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



దశపర్ణి కషాయం తయారీని రైతులకు వివరిస్తున్న షేక్ మాబువలి

కల్లూరు: ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ విభాగం ఎంటి షేక్ మాబువలి తెలిపారు. గురువారం కొంగనపాడు గ్రామంలో రైతు రామకృష్ణారెడ్డి ఇంటి దగ్గర ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే దశపర్ణి కషాయం తయారీని డెమో రూపంలో వివరించారు. దశపర్ణి కషాయంతో పంటలకు ఆశించే పచ్చపురుగు, గొంగళి పురుగు, లద్దె పురుగులను నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో వీఏఏ తిరుమలేష్, రైతులు లక్ష్మన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ఓంకార్ యాదవ్

ఓర్వకల్లు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈఓ-2 ఓంకార్ యాదవ్ సూచించారు. మండలంలోని ఉయ్యాలవాడలోని శ్రీవిద్యానికేతన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శాంతమ్మ స్కూల్, లొద్దిపల్లె బీసీ హాస్టల్‌ను గురువారం ఎంఈఓ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు.

వందరోజుల అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష



అధికారులుతో చర్చిస్తున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీలలో నిర్వహించాల్సిన వందరోజుల అభివృద్ధి ప్రణాళికలపై ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజ్, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ రాముడు సమీక్ష నిర్వహించారు. పలుకుదొడ్డి గ్రామ పంచాయతీ ఆదర్శ గ్రామంగా ఎంపిక అయ్యిందని, అదేవిధంగా గుండ్రేవులు, కంబదహాల్, బురాన్‌దొడ్డి, కొత్తకోట గ్రామాలను ఆదర్శగా గ్రామాలుగా తీర్చిదిద్దాల్సి ఉందని ఎంపీడీఓ తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీలలో వ్యక్తిగత ఇంకుడు గుంతలు, వ్యవక్తిగత మరుగుదొడ్లు, చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణాలు, మరమ్మతులు సంతృప్తి స్థాయిలో పనులను నిర్వహించాలని ఎంపీడీఓ సూచించారు.

సీతారాం మృతి తీరని లోటు

కర్నూలు(న్యూసిటీ): ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు ప్రత్యేకతను చాటిచెప్పిన వ్యక్తి సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. సీతారాం ఏచూరి గురువారం మృతి చెందడంతో నగరంలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం నాయకులు సంతాప సభ ఏర్పాటు చేసి నివాళులర్పించారు. వారు మాట్లడుతూ.. జిల్లాకు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ, సేవలను కొనియాడారు.

కర్నూలు న్యూసిటీ: జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ఉద్యమ పోరాటలకు తీవ్రలోటని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతికి సీపీఐ తరఫున సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో సీపీఐ, సీపీఎం మహాసభలలో ఆయన పాల్గొన్నట్లు గుర్తుచేశారు. రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా ప్రాతినిధ్యం వహించి ప్రజల సమస్యలపై గళమెత్తారన్నారు. ప్రజా, కార్మిక, శ్రమజీవుల ఉద్యమాలకు నాయకత్వం వహించి అలుపెరగని పోరాటాలు చేశారని కొనియాడారు.

చెత్తసేకరణ కేంద్రాలు నిరుపయోగం!

- ఎస్‌డబ్ల్యూఎం షెడ్లు అందుబాటులోకి వచ్చినా వినియోగంలోకిరాని వైనం
- పల్లెల్లో తీవ్రమవుతున్న చెత్త సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు



సి. బెళగల్ : నిరుపయోగంగా ఉన్న బురాన్‌దొడ్డి పంచాయతీ ఎస్‌డబ్ల్యూఎం షెడ్

సి.బెళగల్: పల్లెల అభివృద్ధిని టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. గ్రామీణుల సమస్యలను పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి వర్షాల విస్తృతంగా కురిసిన నేపథ్యంలో పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా దర్శనిమిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. అయితే చెత్త సేకరణ నిమిత్తం ఏర్పాటు చేసిన కేంద్రాలు (సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ -ఎస్‌డబ్ల్యూఎం) నిరుపయోగంగా మారాయి. షెడ్లు అందుబాటులో ఉన్నా చెత్తసేకరణ చేయని పరిస్థితిని గ్రామీణులు తప్పుపడుతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలలో ఎస్‌డబ్ల్యూఎం షెడ్లను నిర్మించి, గ్రామాల్లోని చెత్తను షెడ్లకు తరలించి, అక్కడ తడి, పోడి చెత్తను వేరుచేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యాలతో నిర్మించిన షెడ్లను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. దీంతో గ్రామాల్లో చెత్త సమస్యలు తీవ్రమవుతున్నాయి. అధికారులు షెడ్లను వినియోగంలోకి తీసువచ్చి పల్లెల్లో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. సి.బెళగల్ మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో ఎస్‌డబ్ల్యూఎం షెడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యాయి. అయితే ఇప్పటి వరకు 13 గ్రామ పంచాయతీలలో షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కంబదహాల్, గుండ్రేవుల, పలకుదొడ్డి షెడ్ల వినియోగం జరుగుతుంది. అయితే పోలకల్, తిమ్మందొడ్డి గ్రామ పంచాయతీలలో చెత్త సేకరణ కేంద్రాల ఏర్పాటుకు స్థల సేకరణ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. సంగాల గ్రామంలో కేవలం పిల్లర్ల వరకు మాత్రమే పనులు జరిగాయి.

రూ.3.33 లక్షలు పెండింగ్

మండలంలో చెత్తసేకరణ కేంద్రాల పెండింగ్ పనులు పూర్తి చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో సర్పంచ్‌లు ముందుకు వచ్చారు. ఈ మేరకు ఏడు గ్రామ పంచాయతీలలో షెడ్లను అందుబాటులోకి వచ్చేలా సర్పంచ్‌లు పనులు పూర్తి చేశారు. అయితే నేటికీ బిల్లులు మంజూరు కాలేదు. దీంతో సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. బ్రాహ్మణదొడ్డి షెడ్‌కు సంబంధించి రూ.41,542, ఇనగండ్ల- రూ.41,704, కొత్తకోట-రూ.15,822, సంగాల - రూ.40,684, కొండాపురం - రూ.77,164, బురాన్‌దొడ్డి - రూ.74,222, ముడమాల షెడ్‌కు సంబంధించి రూ.41,842 చొప్పున పెండింగ్ పనులకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఖర్చు చేశారు. మొత్త ఏడు గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.3.33 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. అయితే చెత్త సేకరణ షెడ్లు అందుబాటులోకి వచ్చినా పట్టించుకోని ప్రభుత్వ తీరుపై మండల ప్రజలు మండిపడుతున్నారు.

నెరవేరని లక్ష్యం..!

- వృథాగా చెత్త సేకరణ కేంద్రాలు

గడివేముల: గ్రామాల్లో పారిశుద్ధ్య అస్తవ్యస్తంగా మారింది. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయడంతో కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో పల్లెల్లో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. పల్లెల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెత్త సేకరణ కేంద్రాలను (ఎస్‌డబ్ల్యూపీసీ)అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే వాటి నిర్వహణపై ప్రస్తుతం ఆశించిన స్థాయిలో ప్రగతి కనిపించడంలేదు. మండల పరిధిలోని 14 చెత్తసంపద తయారీ కేంద్రాలు మంజూరు చేశారు. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ. నాలుగు లక్షల నుంచి తొమ్మిది లక్షల రూపాయల వరకు జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరుచేసి నిర్మాణాలు చేశారు. తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించి వాటికి కేటాయించిన షెడ్లుల్లో వేర్వేరుగా వాటిని గ్రీన్‌అంబాసిడర్లు నిల్వచేయాలి. అయితే చాలా పంచాయతీల్లో షెడ్లుల్లో చెత్త నిల్వచేయక ఖాళీగా దర్శనమిస్తున్నాయి.



సి.బెళగల్ : మధ్యలోనే నిలిచిపోయిన షెడ్



గడివేముల: వృథాగా ఉన్న చెత్త సేకరణ కేంద్రాలు



రోగాలు ప్రబలుతున్నాయి



గ్రామాల్లో చెత్తను సక్రమంగా సేకరించడం లేదు. ఎక్కడ పడితె అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వర్షాలు విస్తారంగా కురియడంతో పారిశుద్ధ్యం మరీ అధ్వానంగా మారింది. పారిశుద్ధ్యం లోపించి రోగాలు ప్రబలుతున్నాయి. యూనిట్లు నిర్మించిన తరువాత వాటి నిర్వహణ కూడా సక్రమంగా చేయాలి. వీటి నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలి.

-మాచెర్ల, గడివేముల

అధికారుల పర్యవేక్షణ కరువు



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించిన తరువాత అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. వాటి పర్యవేక్షణపై ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో జీతాల్లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నారు. అధికారులు స్పందించి చెత్త సేకరణ కేంద్రాలను అందుబాటులోకి తేవాలి.

-గోదా ప్రసాద్, ఉపసర్పంచ్, గడిగరేవుల

పెండింగ్ పనుల బిల్లులు ఇంకా రాలేదు

మా గ్రామ పంచాయతీ షెడ్ గతంలో మా ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. అధికారులు వత్తిడి మేరకు షెడ్ నిర్మాణ పనులను పూర్తి చేశాం. అయితే ఇంతవరకు పనులకు సంబంధించి నిధులు మంజూరు అవ్వలేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిధులు మంజూరు చేయాలి. షెడ్ నిర్వహణకు చాలా ఇబ్బందిగా ఉంది. - రామాంజనేయులు, సర్పంచ్, బురాన్‌దొడ్డి, సి. బెళగల్ మండలం

సామాజిక తనిఖీ ప్రజావేదిక



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ అమర్నాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్: మండలంలో 2023ఏప్రిల్ నుంచి 2024మార్చి వరకు ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై పీడీ అమర్‌నాథ్‌రెడ్డి గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో మొత్తం రూ.12,55,36,453 వెచ్చించి 640 పనులు చేపట్టారు. ఈ పనులపై గ్రామాలవారీగా సోషల్ ఆడిట్ బృందం సభ్యులు నివేదికలను సమర్పించారు. కొలతలు, పండ్ల తోటల పెంపకం సరిగా లేని కారణంగా కేవలం రూ.35వేలు పక్కదారి పట్టినట్లు సోషల్ ఆడిట్ బృందం సభ్యులు లెక్కలు తేల్చారు. పనులను సక్రమంగా నిర్వహించకుండా నిధులు పక్కదారి పట్టించిన సిబ్బందికి పీడీ పెనాల్టి వేశారు. పనుల కొలతల్లో తేడాలపై పీడీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ మాధవీలత, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీడీ పక్కీరప్ప, డీవీఓ భాస్కర్, ప్రోగ్రామ్ మేనేజర్ సతీస్, ఎస్టీఎం కోనయ్య, ఏపీఓఉ మోదీన్‌బాషా, జయంతి, సోషల్ ఆడిట్ బృందం సభ్యులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న రంగస్వామి

కోడుమూరు రూరల్: విద్యా రంగ సమస్యలపై విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి పిలుపునిచ్చారు. గురువారం ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోడుమూరులోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో సమావేశమయ్యారు. రంగస్వామి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. సకాలంలో మెస్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మండల నాయకులు వీరాంజనేయులు, మునిస్వామి, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నివేదికలు రూపొందించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అనురాధ

కర్నూలు (రూరల్): గ్రామాల అభివృద్ధికి సంబంధించిన నివేదికలు రూపొందించాలని మండల ప్రత్యేక అధికారి, పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనూరాధ అధికారులకు సూచించారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామీణుల ఆర్థికాభివృద్ధిపై సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతలలో టూరిజం , పాల ఉత్పత్తులు, అటవి ఉత్పత్తులకు సంబంధించి వ్యాపారాలు నిర్వహించేలా నివేదికలు రూపొందించాలన్నారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్యం మెరుగుపడాలి



ఆసుపత్రిని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపడాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. గైనిక్ విభాగంలో వాటర్, ట్యాప్‌ల మరమ్మతులను పూర్తి చేయాలని ప్లంబర్‌కు చెప్పారు. గైనిక్ డీఆర్ వన్‌లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల గురించి ఆరా తీశారు. లేనిచోట కొత్త ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ సిబ్బందిని ఆదేశించారు. ఎమర్జెన్సీ ఓటీలో ఉన్న కండోమినేషన్ పరికరాలను త్వరగా తరలించాలన్నారు. ఆయన వెంట సీఎస్‌ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఏడీ రమేష్ బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి బాయి ఉన్నారు.

సకాలంలో వైద్యమందిస్తే మాతృమరణాలకు చెక్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులకు సరైన సమయంలో వైద్య సేవలు అందించడం ద్వారా మాతృమరణాలను తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం ఆయన ఛాంబర్‌లో మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. జూన్, జులై, ఆగస్టు మాసాల్లో సంభవించిన మరణాలపై సమీక్ష చేశారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు గర్భవతులను 12 వారాల్లోపు గుర్తించి వివరాలు నమోదు చేసుకుని సకాలంలో వైద్యసేవలు అందించేలా చూడాలన్నారు. గర్భిణుల్లో ప్రమాదకర లక్షణాలు ఉంటే ఆరోగ్య కార్యకర్త, పర్యవేక్షకులతో ట్రాక్ చేసి సమీప సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు 108 ద్వారా తరలించి సత్వర చికిత్స అందించడం ద్వారా మాతృమరణాలను తగ్గించవచ్చన్నారు. దీనిపై గర్భిణుల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలచాలన్నారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డీపీఎంఓ డాక్టర్ ఉమా, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

కర్నూలు(న్యూసిటీ): స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా సూచించారు. ఆయన గురువారం జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతే సేవా కార్యక్రమ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంపై గ్రామాలలో ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేసి విజయవంతం చేసేలా చూడాలన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

కర్నూలు సిటీ: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా కృషి చేయాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం బీక్యాంపులోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో 2024-25 మొదటి సంవత్సర బ్యాచ్ విద్యార్థులకు కోర్సు ఒరియేంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు మొదటి నుంచే ఓ నిర్దిష్టమైన ప్రణాళిక వేసుకొని చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఆయా సబ్జెక్టుల విభాగాధిపతులు వారి సబ్జెక్టుల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష

కర్నూలు కల్చరల్: ఈ నెల 15వ తేదీన వినాయక నిమజ్జనం నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో.. వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై జిల్లా అధికారులు, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిమజ్జన ఏర్పాట్లు చేయాలన్నారు. నీటి సరఫరా, పోలీస్ బందోబస్తు, రూట్‌మ్యాప్, గజ ఈతగాళ్లు, నిమజ్జన క్రేన్లు, విద్యుత్‌సరఫరా, మెడికల్ క్యాంప్‌లు, తాగునీటి సౌకర్యం, అంబులెన్సు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆర్‌అండ్‌బీ వారు వినాయక ఘాట్‌లో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ.. నిమజ్జనం జరిగే ప్రాంతంలో ప్రకాశవంతమైన విద్యుత్ దీపాలు, పెయింటింగ్ పనులు, ఘాట్‌లను శుభ్రపరిచే పనులు మొదలు పెట్టామన్నారు. నిమజ్జనం తిలకించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ చిరంజీవి, ఆర్‌డీఓ శేషిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నగర అధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

14న మొల్లమాంబ విగ్రహావిష్కరణ

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య సూచనల మేరకు ఈ నెల 14వ తేదీన ఉదయం 10 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూగూరు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాకు చెందిన కుమ్మర శాలివాహన సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలి



ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

సి.బెళగల్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎంఈఓ ఆదామ్‌బాషా పిలుపునిచ్చారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల ఇన్‌చార్జ్, కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటల పోటీలను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడుతో కలిసి ఎంఈఓ ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా, చెస్ తదితర పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని ఎస్‌జీఎఫ్ మండల ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడి అవార్డు పొందిన గురుకుల పాఠశాల పీడీ రాఘవేంద్రను సన్మానించారు. కార్యక్రమంలో గురుకుల వైస్ ప్రిన్సిపాల్ విజేయుడు, పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యకుమార్, చక్రపాణి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.



సి.బెళగల్ - గూడూరు ప్రధాన రహదారిపై ఇటుకల బట్టి వద్ద కుంగిన కల్వర్టు

ప్రధాన రహదారి అధ్వానం

సి.బెళగల్: గ్రామీణ రహదారులు ఛిద్రమయ్యాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి మండల కేంద్రం సి. బెళగల్ నుంచి గూడూరు పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. అక్కడక్కడ గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. అడుగో గుంత అన్నట్లుగా ఉంది ఈ ప్రధాన రహదారి. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదానికి గురికావాల్సిందే. సి.బెళగల్ కస్తూర్బా స్కూల్ దగ్గరున్న కల్వర్టు ప్రక్కన ప్రధాన రోడ్డు కోతకు గురైంది. దీంతో రోడ్డు పక్కనే దాదాపు 10 అడుగల భారీ గోయ్యి ఏర్పండి. అదేవిధంగా ఇటుకబట్టి దగ్గర కల్వర్టు కుంగింది. రోడ్డుపైనే రంధ్రం ఏర్పడింది. దీంతో వాహనచోదుకులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం మరమ్మతులు చేయించాలని వాహనచోదకులు, బాటసారులు కోరుతున్నారు.



కస్తూర్బా పాఠశాల దగ్గర కోతకు గురైన రోడ్డు



రోడ్డుపై ఏర్పడిన రంధ్రం

ఆర్థిక సాయం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం గ్రామానికి చెందిన ఏదు సురేష్ (28) అనారోగ్యంతో మృతి చెందడంతో ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ. 10వేలు అందించారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న సురేష్ ఆరోగ్యం క్షీణించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య మల్లేశ్వరి, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు.